పోషకాహారంపై అవగాహన ఉండాలి



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ లతశశి తదితరులు

సుల్తాన్‌బజార్: పోషకాహారంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫెర్నాండేజ్ ఆసుపత్రి డిపార్ట్‌మెంట్ ఆఫ్ క్లీనిక్ న్యూట్రిషియన్ డైటిక్స్ ప్రధాన అధికారి డాక్టర్ లతశశి అన్నారు. కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలోని పీజీ సెమినార్ హాల్‌లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్, హైదరాబాద్ చాప్టర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సెంటినరీ లెక్చర్ సిరీస్–ఏ క్లినిక్ న్యూట్రిషన్ ఆఫ్ డైట్ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై వీసీ ప్రొఫెసర్ విజ్జులతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లల్లో నరాల బలహీనత వల్ల వచ్చే వ్యాధులకు చికిత్స, పోషకాహారం ప్రాముఖ్యత, అలాగే వైద్యరంగంలో పోషకాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి వైద్యులు కె.సునిత ప్రేమలత, మెడికవర్ ఆసుపత్రి చీఫ్ క్లీనికల్ డైటీషియన్ శ్రీలత, అపోలో ఆసుపత్రి సీనియర్ డైటీషియన్ కల్లూరి సౌమ్య, ఐ.ఎస్.సీ.ఏ ప్రొఫెసర్ సి.నాగరాజు రావు, ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ విభాగం హెచ్‌వోడీ అసిస్టెంట్ సుమ, డాక్టర్ సంతోషి, డాక్టర్ శృతి, కోఆర్డినేటర్ డాక్టర్ ప్రేమలత, ఖనిజ్ ఆదిత్య పాల్గొన్నారు.

భక్తుల పాలిట కల్పవల్లి.. ఫలక్‌నుమా కాళీమాత

ఆలయానికి పోటెత్తుతున్న భక్తులు

- ఆది, మంగళ, శుక్రవారాలతో పాటు అమావాస్య రోజున రద్దీగా మారుతున్న ఆలయ పరిసరాలు
- అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ఆలయ నిర్వాహకులు



చాంద్రాయణగుట్ట: కోరిన కోరికలు తీరుతుండడంతో ఫలక్‌నుమాలోని మహాకాళి మాత మందిరాన్ని దర్శించుకునే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ వస్తుంది. రెండేళ్ల క్రితం వరకు సాధారణ ఆలయంగానే ఉన్న ఈ ఆలయం.. ప్రస్తుతం భక్తజన సంద్రంగా మారుతోంది. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాలతో పాటు అమవాస్య రోజున వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారి సేవలో కొలువుదీరుతున్నారు. ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ సమీపంలో కట్ట మైసమ్మ మహాకాళి మాత, ఎల్లమ్మ అమ్మవారి ఆలయం ఉంది. ఎల్లమ్మ ఆలయం ఒక వైపు ఉండగా.. ఆ పక్కనే రక్త మైసమ్మ అమ్మవారి చిన్న ఆలయం ఉంది. ఈ ఆలయం పైనే గాంభీర్యమైన రూపంలో కొలువుదీరిన కాళీమాత అమ్మవారిని దర్శించుకున్న భక్తుల కోరిన కోరికలు తీరుతుండడం.. అమ్మవారి మహత్యాన్ని గుర్తించిన భక్తులు తమకు తెలిసిన వారికి చెబుతుండడం.. స్థానిక యువత సైతం సామాజిక మాధ్యమాలలో అమ్మవారి విశిష్టతను తెలియజేస్తుండడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ వస్తుంది. ప్రతి అమావాస్యకు దాతల సహకారంతో అన్నదానం కూడా ఏర్పాటు చేస్తు న్నారు. నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ, ఆరె మైసమ్మ ఆలయాలలో మాదిరిగా ఇక్కడ కూడా భక్తులు నాటు కోళ్లు, పొట్టేళ్లను కూడా బలి ఇస్తూ దావత్‌లు కొనసాగిస్తున్నారు. భక్తులకు అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని నిర్వాహకులు బొల్లు జగన్ తెలిపారు.

పక్క రాష్ట్రం నుంచి కూడా భక్తుల తాకిడి



కాళీమాత అమ్మవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా విజయవాడ నుంచి కూడా మహిళా భక్తులు తరలి వస్తున్నారు. అమావాస్య వచ్చిందంటే ఆలయ పరిసరాలు రద్దీగా మారుతున్నాయి. బస్సు, రైలు లాంటి రవాణా సదుపాయం కూడా ఉండడంతో భక్తులకు వెసులుబాటుగా మారింది. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా స్థానిక యువకులు సాయంగా ఉంటున్నారు.

– వినీత్, స్థానిక యువకుడు

కోరికలు తీరుతున్నాయి..



ఫలక్‌నుమాలోని కాళీకామాత అమ్మవారి మహత్యాన్ని బంధువుల ద్వారా తెలుసుకున్నాను. షాద్‌నగర్ నుంచి వచ్చి గత నెలలో వచ్చి మొక్కుకున్నా. అప్పటి నుంచి ఎంతో మంచిగా ఉంటుంది. అందుకే మళ్లీ వచ్చా. అమ్మవారి సన్నిధిలో ఉంటే తెలియని భక్తి పారవశ్యంతో కూడిన మానసిక ప్రశాంతత కలుగుతుంది. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది.

– ఉమారాణి, షాద్‌నగర్



కాళీమాత అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మంత్రిని కలిసిన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు



మంత్రి దామోదర రాజానర్సింహను కలిసిన హనుమంతరావు, డాక్టర్ శ్రీనివాసులు

అబిడ్స్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజానర్సింహను ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి బి.హనుమంతరావు, మెడికల్ అండ్ హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సంజీవ్‌కుమార్, అడ్వైజర్ డాక్టర్ జి.శ్రీనివాస్, సీనియర్ ప్రతినిధులు డాక్టర్ టీఎస్.వంశీ తిలక్ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి మెడికల్ అండ్ హెల్త్ స్టాల్‌ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. అలాగే సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు మంత్రికి వివరించారు.

ఆలయంలో 'స్వచ్ఛ తీర్థ్'



ఆకాష్‌పూరిలో స్వచ్ఛతీర్థ్‌లో శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: అయోధ్య సంబరాల సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపుమేరకు ధూల్‌పేట్ ఆకాష్‌పూరి హనుమాన్ ఆలయంలో శుక్రవారం తీర్థ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ స్వయంగా ఆలయాన్ని శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 న గోషామహల్ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ అయోధ్య సంబరాలను దీపావళి సంబరాలుగా చేపట్టాలన్నారు. అలాగే ప్రతిఇంటిని దీపాలంకరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ బీజేవైఎం కన్వీనర్ సోమరాజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాతావరణ మార్పులపై సెమినార్

అబిడ్స్: వాతావరణంలో కలుగుతున్న మార్పులపై అబిడ్స్ డైమండ్ జూబ్లీ హైస్కూల్‌లో సెమినార్ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత గాడే వెల్లడించారు. ఈ నెల 20న పాఠశాల 4వ అంతస్తులోని ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు వాతావరణం మార్పుల కారణాలు తీసుకునే జాగ్రత్తలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సోలార్ మ్యాన్, ఇంజినీరింగ్ వాతావరణంలో కలుగుతున్న మార్పులపై అవగాహన చేపడతామన్నారు. ఎలా వాతావరణంలో మార్పులు కలుగుతున్నాయో ప్రజలు ఎలా జాగ్రత్త తీసుకోవాలని క్లుప్తంగా ప్రముఖ సోలార్ మ్యాన్ వివరిస్తారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటుడడంతో ఎలా ప్రజలు తమ జీవితాలను గడపాలనే విధానంపై ప్రొఫెసర్ చేతన్ సోలంకి క్లుప్తంగా వివరిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ జి.శంకర్ రాజు

అబిడ్స్: విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. అబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులనుద్దేశించి ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు నడుపవద్దని పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైనింగ్ బోర్డులను సూచనలు సలహాలు పాటిస్తూ సేఫ్టీగా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. రాంగ్ రూట్‌లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని పేర్కొన్నారు. పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్కు చేసుకోవాలని, రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కు చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ నిబంధనలపై ఏసీపీ శంకర్ శంకర్ రాజు విద్యార్థులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జార్జ్ గర్ల్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.కారోల్‌పాల్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక 'ఓటరు నమోదు'



ఎల్.సరిత

చార్మినార్: రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ ఎల్.సరిత కోరారు. ఈ నెల 20, 21 తేదీలలో చార్మినార్ శాసన సభ నియోజకవర్గంలోని పత్తర్‌గట్టి, ఘాన్సీబజార్, పురానాపూల్, శాలిబండ, మొఘల్‌పురా తదితర ఐదు మున్సిపల్ డివిజన్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగే ఓటరు నమోదు సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో సంబంధిత అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ నెల 1వ తేదీ వరకు 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ యువకులు తమ పేర్లను కొత్తగా నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

సందర్శకులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



శంకర్ బేగంబజార్ ఇన్‌స్పెక్టర్

అబిడ్స్: నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహిస్తున్న అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనకు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా భద్రతను ఏర్పాటు చేపడుతున్నట్లు బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శంకర్ అన్నారు. ఎగ్జిబిషన్ మైదానాన్ని శుక్రవారం పరిశీలించి అవుట్ పోస్ట్‌లో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనకు నగర నలుమూలల నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, వారి భద్రతకు గాను 210 మంది సిబ్బందితో బందోబస్తు చేపడుతున్నామన్నారు. నలుగురు సీఐలు, 11 మంది ఎస్ఐలు సిబ్బందితో కలిసి మైదానాన్ని మూడు సెక్టార్లుగా విభజించి ఒక్కో సెక్టార్‌కు ఒక సీఐని ఇన్‌ఛార్జిగా నియమించి బందోబస్తు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా మైదానంలో ఉన్న పోలీస్ అవుట్ పోస్టులో సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా పోలీస్ స్టాల్‌ను సందర్శించి పోలీసు శాఖ ప్రజలకు చేపడుతున్న పలు విషయాలపై అవగాహన పొందాలని కోరారు. పోలీస్ అవుట్ పోస్టను నగర సీపీతో పాటు అదనపు కమిషనర్, డీసీపీ ఇతర పోలీస్ ఉన్నతాధికారులు సందర్శించినట్లు ఆయన పేర్కొన్నారు.

అభినందనలు



జియాగూడ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాల అమలుకు చిత్త శుద్ధితో కృషి చేస్తుందని కార్వాన్ నియోజకవర్గం జియాగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిషన్ గజరే అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో నూతనంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్ గౌడ్‌ను కండువా కప్పి అభినందించారు. అనంతరం కిషన్ గజరే మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరసింహా నాయక్

సంతోష్‌నగర్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇ.నరసింహా నాయక్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని ఐ.ఎస్.సదన్ చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు ఆయన ఎస్సైలతో కలిసి అవగాహన కల్పించారు. నరసింహా నాయక్ మాట్లాడుతూ..ఆటో డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలపకుండా ఆటోరిక్షా స్టాండ్‌లలో మాత్రమే నిలుపాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ ఎస్సైలు సత్యనారాయణ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలు



ముజీబ్ హుస్సేనికి పురస్కారాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ బండ ప్రకాష్, దయానంద్ తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రపంచ దేశాలకు భారతజాతి అనునిత్యాన్ని సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పిన అంతర్జాతీయ దార్శనికుడు స్వామి వివేకానంద అని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండ్ల ప్రకాష్ అన్నారు. నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువత పైనే దేశ భవిత ఆధారపడి ఉంటుందని తెలిపారు. తెలంగాణ శాసనమండలి సభ్యులు బొగ్గారు దయానంద్ మాట్లాడుతూ..నేటి యువత స్వామి వివేకానంద జీవితాన్ని అధ్యాయనం చేయాలన్నారు. సినీ నటులు మాజీ మంత్రి బాబుమోహన్ మాట్లాడుతూ.... స్వామి వివేకానంద భారత దేశ గొప్పదనాన్ని విదేశీయులకు చాటి చెప్పిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కటకం భాస్కర్‌గుప్తా, హైదరాబాద్ టీఎస్జీటీఎస్ యూనియన్ అధ్యక్షులు ముజీబ్ హుస్సేని ఫిట్‌నెస్ గురు అనుప్రకాష్, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ అధ్యక్షులు బత్తుల హేమంత్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ఉన్న ప్రముఖులకు స్వామి వివేకానంద సేవా పురస్కారాలను ప్రదానం చేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే కౌసర్‌కు మెమొంటో అందిస్తున్న దృశ్యం

గోల్కొండ: పిల్లలను చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన కల్పిస్తున్న అహ్లే సున్నత్ వెల్ఫేర్ సొసైటీ వారి సేవలు అమోఘం అని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం సొసైటీ వారు టోలిచౌకీలో సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక బోధనల వల్ల పిల్లలు బాధ్యతగల పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్ : చార్మినార్ సబ్‌డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ అఫ్జల్‌బాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీబీబజార్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆస్రా ఆసుపత్రి పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఫంచ్‌మొహల్లాలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

అఫ్జల్‌గంజ్: 11 కేవీ రాంసింగ్‌పురా, గంగానగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సనా హోటల్, ఆర్యసమాజ్, ఎంసీహెచ్ పార్క్, తాళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కే.వి కమేళా, సబ్జిమండి విద్యుత్ ఫీడర్ల పరిధిలోని దరియా బాగ్, పన్నిపురా, మార్కండేయ భవన్, సబ్జి మండి, పోస్ట్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు పేర్కొన్నారు.

'అన్ని ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుంది'



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కార్వాన్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ శుక్రవారం ఆయనను కలిసి ఎమ్మెల్సీగా ఎంపికైన సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కాలం చెల్లిన పార్టీ అని అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించిన ఓటర్లు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీని పూర్తిగా బుట్టదాఖలు చేయడం ఖాయమన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్దుల్ హమీద్ తదితరులున్నారు.

27న అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 4వ వార్షికోత్సవం

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 27న రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 4వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.సరోజనమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులకు సేవా రత్న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో రాణిస్తున్న విశిష్ట వ్యక్తులు పూర్తి వివరాలకు 97053 13061 లో సంప్రదించాలని సూచించారు.

పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలి



విద్యార్థులకు అవార్డులను అందజేస్తున్న వాణీప్రసాద్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థి దశ నుంచే పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలని రాష్ట్ర అటవీ, సామాన్య సాంకేతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ అన్నారు. స్వచ్ఛభారత్ లక్ష్య సహకార దిశగా పాడిచెత్త రీ సైకిలింగ్ కోసం కృషి చేస్తున్న పాఠశాలలు, విద్యార్థులకు వెల్ బీయింగ్ ఔటాఫ్ వేస్ట్ (డబ్ల్యూవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఇంటర్‌స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్‌షిప్ అవార్డులను శుక్రవారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తాచెదారం, వ్యర్థాల నిర్వహణ ద్వారా స్వచ్ఛ్‌భారత్ ను ముందుకు తీసుకువెళ్లడంలో పాఠశాలలు, విద్యార్థుల సహకారాన్ని అభినందించారు. స్వచ్ఛ్‌భారత్, స్వచ్ఛ్ హైదరాబాద్ వంటి జాతీయ, స్థానిక స్థాయిలో పరిశుభ్ర లక్ష్యాలను సాధించడానికి అవగాహన ఎంతో ముఖ్యమన్నారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ శాస్త్ర వేత్త ప్రసన్నకుమార్, ఎంఏఆర్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.మురళి, ఐటీసీ పేపర్‌బోర్డు చీఫ్ మేనేజర్ ఎస్.ఎం.ఉమాకాంత్, డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వాజిరాజు కులకర్ణి, సుధాపోలేమి పాల్గొన్నారు.

22న వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

సంతోష్‌నగర్: ఈ నెల 22న అయోధ్యలోని శ్రీరామ చంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా సంతోష్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి నల్ల దీగల శ్రీనివాసాచార్యులు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి సామూహిక సంక్షేమ రామాయణ పారాయణం, సామూహిక శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ, రమాదేవి బృందంతో కూచిపూడి నృత్యం కార్యక్రమాలు, సూర్యప్రభ బృందంతో భక్తి సంగీత విభావరి భజనలు, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అయోధ్యలో ప్రతిష్ఠాపన కార్యక్రమం స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు. అనంతరం రక్షాపురానికి చెందిన 50 మంది మహిళలతో సామూహిక కోలాటాలు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

టోలిచౌకీ డివిజన్‌లో ముంపు సమస్యకు చెక్



మజ్లిస్ నాయకులతో హారూన్‌ఫరాన్ తదితరులు

గోల్కొండ: టోలిచౌకీ డివిజన్‌లో వరద ముంపునకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు చేస్తున్న పనులు దాదాపు పూర్తయ్యాయని టోలిచౌకీ కార్పొరేటర్ ప్రతినిధి హారూన్‌ఫరాన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీలో మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నదీం కాలనీ ముంపు కాలనీగా గుర్తింపు పొందిదని ప్రతి యేటా వర్షపు నీరు నదీమ్ కాలనీని ముంచెత్తుతూ వస్తుండడమే దీనికి కారణమని ఆయన అన్నారు. ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ చూపిస్తున్న ప్రత్యేక చొరవతో టోలిచౌకీ డివిజన్‌లో వరద ముంపు నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలయ్యిందని ఆయన అన్నారు. టోలిచౌకీ చౌరస్తా, రియాస్‌నగర్ కాలనీ, నదీమ్ కాలనీలలో వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా నేరుగా శాతం చెరువులోకి వెళ్లేందుకు ప్రత్యేకంగా పైపులైన్‌లు వేయడం జరిగిందన్నారు. అమీర్, హబీబ్‌చాస్, జబ్బార్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

22న రచయిత్రి జానకీబాలకు సాహిత్య పురస్కార ప్రదానం



గన్‌ఫౌండ్రీ: ఈ నెల 22న ప్రముఖ రచయిత్రి ఇంద్రగంటి జానకీబాలకు సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారాన్ని రవీంద్రభారతిలో ప్రదానం చేయనున్నట్లు రసమయి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె.రాము శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు లక్ష రూపాయాల నగదు. జ్ఞాపికతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ మజహరుల్లా తదితరులు

గోల్కొండ: పరిసరాల పరిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యానికి మొదటి మెట్టు అని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. శుక్రవారం ఏరియా ఆసుపత్రిలో ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ తదితరులతో కలిసి ఆసుపత్రి వార్డులు, ఆసుపత్రి ప్రాంగణంలో చెత్తను ఏరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆసుపత్రిని దాని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి తాము ఎంతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో శ్రీనివాసరావు, ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు ఐదు కొత్త గ్యాలరీల ప్రారంభోత్సవం

బహదూర్‌పురా: సాలార్‌జంగ్ మ్యూజియంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు గ్యాలరీలను ఈనెల 21న సాయంత్రం 4 గంటలకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి శిల్పి, పద్మ అవార్డు గ్రహీత డాక్టర్ ఎ.యాదగిరి రావు సమక్షంలో ప్రారంభించనున్నట్లు మ్యూజియం అధికారులు తెలిపారు. మ్యూజియంలో 2వ శతాబ్దపు బీసీ నాటి దాదాపు 40 వస్తువులతో కూడిన భారతీయ శిల్ప గ్యాలరీ, బిద్రివేర్ గ్యాలరీలో దాదాపు 300 ప్రత్యేక వస్తువులు, దీపం, షాండెలియర్ గ్యాలరీ, యూరోపియన్ బ్రాంజ్ గ్యాలరీ తదితర గ్యాలరీలను ప్రారంభించనున్నారన్నారు.

బాలుడి అదృశ్యం



వెంకటేశ్

డబీర్‌పురా: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటున్న అశోక్, సునీతల దంపతుల కుమారుడు వెంకటేశ్ (13) కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడికి సరిగ్గా మాటలు కూడా రావు. అశోక్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 4న తల్లిదండ్రులు పని నిమిత్తం బయటికి వెళ్లగా వెంకటేశ్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం



పార్టీలో చేరిన వారితో ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హాజిరీ

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలియమైన శక్తిగా తయారవుతుందని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హాజిరీ అన్నారు. శుక్రవారం అంద్రూన్ కార్వాన్‌లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారందరికీ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో పూర్తి చేస్తారన్నారు. నాయకులు దుర్గాప్రసాద్, అమ్జద్ ఆలీఖాన్ తదితరులున్నారు.

అగ్నిప్రమాదం



విజయనగర్‌కాలనీ: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇల్లు పాక్షికంగా కాలిపోయిన ఘటన శుక్రవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మెహిదీపట్నం జీవన్ కల్యాణ్‌నగనర్‌లో నివసించే వీఎల్.కాంతారావు ప్రైవేటు ఉద్యోగి. పని నిమిత్తం కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఇంట్లో నుంచి పొగలు వస్తుండగా స్థానికులు గమనించి ఇంటి యజమానితో పాటు 101కు సమాచారం ఇచ్చారు. లంగర్‌హౌస్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన వచ్చి స్థానికులతో కలిసి మంటలను ఆర్పివేశారు. ఎటువంటి ప్రాణనష్టం కలుగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.